అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో బుధవారం రాత్రి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెక్కలం గొల్లగూడెంలో 1340 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి హరిబాబు, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గోపాలరావు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

నూజివీడు: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అనేది ఓటర్లకు వజ్రాయుధం వంటిదని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేషన్ స్టడీస్ ప్రిన్సిపాల్ ఆచార్య వెంకట రాము అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు షేక్ అన్వర్‌బాషా, తాళం నాగరాజు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సత్కారం

తిరువూరు: జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా బుధవారం తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను అధికారులు సన్మానించారు. తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని వృద్ధ ఓటర్లను సన్మానించారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు ఆవశ్యకత వివరిస్తూ బ్యానర్లు, ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

నిర్భయంగా ఓటువేయాలి

గంపలగూడెం: ఓటు హక్కును ప్రతి ఓటరూ నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ పిచ్చిరెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైనది

చాట్రాయి : ఓటు హక్కు చాలా విలువైనదని తహసీల్దార్ సీహెచ్ విశ్వనాధరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ దామెర ఉషా, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరైన వ్యక్తిని ఎన్నుకోవాలి

ముసునూరు : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని, ఓటర్లంతా తమ ఓటు ద్వారా సరైన వ్యక్తిని నాయకడిగా ఎన్నుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన పిలుపునిచ్చారు. తహసీల్దార్ దాసరి సుధ, ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ పి.గంగాధరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కొండపర్వలో..

కొండపర్వ (విస్సన్నపేట): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం సీనియర్ సిటిజన్‌ను సన్మానించారు. వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, వీఆర్వో కాంతారావు, హెచ్ఎం జయరామ్ పాల్గొన్నారు.



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న పీజీ కేంద్రం విద్యార్థులు

కె.తాడేపల్లిలో..

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైందని కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అన్నారు. బుధవారం కె.తాడేపలి జెడ్పీ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్లకు సన్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి పి.మురళీమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్నాటి రాంబాబు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. జాకీర్ హుస్సేన్ కళాశాల ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మూలపాడు జెడ్పీ పాఠశాలల్లో నూతనంగా నమోదైన యువ ఓటర్లకు కార్డులు అందజేశారు. తహసీల్దార్ సూర్యారావు పాల్గొన్నారు.

లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో..

మైలవరం: ఓటు హక్కు ప్రతి ఒక్కరి జన్మ హక్కు అని, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు కిశోర్‌బాబు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల కిశోర్‌బాబు మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా గ్రామ/వార్డ్ సచివాలయ అధికారి, డీఎల్‌డీఓ కె.అనురాధ పిలుపునిచ్చారు. గొల్లపూడి మండల ప్రజా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూల్ హెచ్ఎం హైమేశ్వరరావు, వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

జి.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటర్లదే కీలకపాత్ర

నూజివీడు : ప్రజాస్వామ్య దేశంలో ఓటర్లే కీలకపాత్ర పోషిస్తారని, తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకునేలా నిర్ణయాలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సారధి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలువురు సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు.ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సింగ్, ఎంపీడీఓ సుందరి పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

హనిమిరెడ్డి సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



హనిమిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామవాసి, ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మైలవరం, వెల్వడం గ్రామాల అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రహనిమిరెడ్డి అమెరికా నుంచి స్వగ్రామం వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మైలవరంలోని ఆయన నివాసం హనిమిరెడ్డి ప్యాలస్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ హనిమిరెడ్డి మైలవరం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. డాక్టర్ హనిమిరెడ్డి స్ఫూర్తితో దాతలు మైలవరం అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.అజాద్, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, వైస్ ఎంపీపీ షేక్ రహీం , ఉప సర్పంచ్ సీతారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

నూజివీడు: విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని కృష్ణా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో అమలవుతోన్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనంను తయారు చేశారా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల కోసం స్ఫూర్తి పేరుతో అందించిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. డీవైఈఓ సేవియా, హెచ్ఎం స్వర్ణలత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రామస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

నూజివీడు : హమాలీ, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ముఠా వర్కర్ల కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే ముఠా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠావర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి శ్రీనివాసరావు, కె.కృష్ణ, ఉపాధ్యక్షుడు కె.రామమూర్తి, కోశాధికారి తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి

తిరువూరు: ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ప్రకటించిన ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని తిరువూరు నగరపంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ వ్యాపారులను కోరారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఫ్లెక్సీ ప్రింటర్లు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయ దుకాణదారులతో సమావేశం నిర్వహించిన కమిషనర్ ప్రభుత్వాదేశాలను తెలియజేశారు. ఫ్లెక్సీలను ఇకపై ముద్రించరాదని, వస్త్రంతో చేసిన బ్యానర్లను మాత్రమే వాడాలని సూచించారు. వార్డు సచివాలయ సిబ్బంది ఈ నిబంధనలను తప్పక అమలు చేసే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

ఎ.కొండూరు: నల్ల తామర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి బి.నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ మిరప పంటలో ఆశిస్తున్న నల్ల తామర పురుగు నివారణకు జీవ నియంత్రణ పద్ధతిలో వేప, వేపనూనె, జిగురు అట్టలనువాడుకోవాలన్నారు. పంట మార్పిడి చేయడం, వేసవిలో లోతు దుక్కులు దున్నడం, పశువుల ఎరువు, వేప చెక్క, వర్మికంపోస్టును రెండు దఫాలుగా వేయడం, పొలం చుట్టూ రక్షణ పంటలుగా జొన్న, మొక్కజొన్న సాగుచేయాలని సూచించారు. స్పైనోసడ్25ఎంఎల్, స్పైరోటెట్రామాట్ 75ఎంఎల్, పిప్రోనిల్ 25ఎంఎల్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామచంద్రారావు, వీహెచ్ఎ వెంకటేశ్వరరావు, జి వెంకట్రావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఏఈఆర్ఓ అవార్డు అందుకున్న తహసీల్దార్ శ్రీనివాస్



మైలవరం: మైలవరం తహసీల్దార్ ముత్యాల శ్రీనివాస్ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్నారు. విజయావాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి చేతులు మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

పట్టాభిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఆగిరిపల్లి : అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఈదులగూడెంలో నిర్వహించిన టీడీపీ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు వేణుగోపాల అప్పారావు చీటి చింపేస్తాం అని, అంతమొందిస్తాం అనే అర్థం వచ్చేలా పట్టాభి వ్యాఖ్యలు చేశారన్నారు. ఎమ్మెల్యే తనయుడికి ప్రాణ హాని ఉందని భావిస్తు టీడీపీ నేత పట్టాభిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై చంటిబాబుకు వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అజాత శత్రువుపై అవాకులు, చవాకులు సహించబోము

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు చంటి నాయనపై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలను మండల నేతలు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి సుబ్బారావు అధ్యక్షతన బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, వైస్ ఎంపీపీ రాజానాయన, గంగాధరరావు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలకు పట్టాభి తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యూత్ అధ్యక్షుడు జి.రంగారావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రిపబ్లిక్ డే

మైలవరం: మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 9గంటలకు రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని పేర్కొంది.

ముగిసిన నిత్య సహాయమాత ఉత్సవాలు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో నిత్య సహాయమాత ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు హాజరైన ఖమ్మం విశ్రాంత బిషప్ పాల్ మైపన్ ప్రసంగిస్తూ శాంతి, సమాధానాలతో జీవించడమే క్రైస్తవమని అన్నారు.

రూ.50లక్షల రుణాల పంపిణీ

మల్లేల(తిరువూరు): మండలంలోని మల్లేల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులైన రైతులకు బుధవారం రూ.50 లక్షల రుణాలను పంపిణీ చేశారు. సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ సంబంధ అవసరాలకు కర్షక మిత్ర, రైతు నేస్తం రుణాలను సంఘ చైర్‌పర్సన్ కలకొండ రవికుమార్, సీఈఓ మట్టూరి వెంకటేశ్వరరావు అందజేశారు.

డైరీ ఆవిష్కరణ

మైలవరం: స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో రహదారులు, భవనాల విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ గజ్జల ఏడుకొండలు ఆర్అండ్‌బీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఓటర్లకు గుర్తింపుకార్డుల పంపిణీ

గంపలగూడెం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండలంలోని 69 పోలింగ్ స్టేషన్ల పరిధిలో నూతనంగా మంజూరైన ఓటరు గుర్తింపు కార్డులను బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులతో పంపిణీ చేశారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి కొత్త ఓటర్లకు కార్డులు అందజేశారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏబీసీ డైరెక్టర్ వల్లూరు ఆకాష్ కుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు(కొత్తూరు) గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో నూతన సంవత్సరం 2023 సందర్భంగా ఎస్‌బీసీ-కేటీసీ సౌజన్యంతో విద్యార్థులకు గిఫ్ట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. పాస్టర్ డి.సుబ్బారావు, పీ ఆంజనేయులు, రాంబాబు, ఎస్.సాల్మన్, బి.వెంకట్రావు పాల్గొన్నారు.

మోహన్‌రావు ట్రస్ట్ సేవలు అభినందనీయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ డాక్టర్ మామిడి వెంకటమోహన్‌రావు వర్ధంతి కార్యక్రమం కొండపల్లిలో బుధవారం జరిగింది. అనంతరం జెడ్పీ పాఠశాలల్లో టెన్త్ క్లాస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ మహబూబాషా, న్యాయవాది అబ్దుల్ మతీన్, మాజీ సర్పంచులు అమ్మాజీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

80 మందికి కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘ ఆధ్వర్యంలో మండలంలోని పోరాటనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంనందు కంటి వైద్యులు పల్లెపామ్ లక్ష్మీకుమారి పాల్గొని 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యుడు భూక్య అయ్య, అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యవసాయ సహాయకురాలిగా ఫైజా

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకురాలు షేక్ ఫైజా సిమీన్ ఎన్టీఆర్ జిల్లాలో ఉత్తమ వ్యవసాయ సహాయకురాలిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. గురువారం రిపబ్లిక్ వేడుకల్లో ఉత్తమ అవార్డును స్వీకరించేందుకు రావాల్సిందిగా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి ఫైజాకు ఆహ్వానం వచ్చింది.

రేపు తాజ్ బాబా జన్మదిన వేడుకలు

ఎ.కొండూరు: ఏఏఎంటీకే దర్బార్‌లో శుక్రవారం నాగపూర్ షరీఫ్‌లో వేంచేసియున్న హుజూర్ హజరత్ సయ్యద్ మహమ్మద్ బాబా తాజుద్దీన్ తాజుల్ ఔలియా మహాత్ముల వారి జన్మదినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏఏఎన్‌టీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి బుధవారం తెలిపారు. భక్తులు పాల్గొని అన్న సమారాధన ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

ఆర్థిక సాయం

నూజివీడు: మీర్జాపురం పీఏసీఎస్ సభ్యురాలు ఓలేటి స్వర్ణకుమారి ఈనెల 23న మృతిచెందగా, ఆమె కుటుంబ సభ్యులకు సొసైటీ తరఫున సొసైటీ అధ్యక్షుడు రంగారావు బుధవారం రూ.10వేల సాయాన్ని అందజేశారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఉత్తర్వుల మేరకు సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే కేడీసీసీబీ తరఫున సాయాన్ని అందిస్తున్నారు. స్వర్ణకుమారి కుమారుడు వీరభాస్కరరరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు.